క్లుప్తంగా

సప్లయ్ చానల్ పనులు ప్రారంభం



సప్లయ్ చానల్ పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా

పీలేరు రూరల్: ఇటీవల కురుస్తున్న వర్షాలకు పింఛా నంది వృథాగా పోకుండా సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా ఇటాచితో సప్లయ్ చానల్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛా నది నుంచి సమ్మర్ స్టోరేజ్, కొత్తపల్లి చెరువు, అయ్యప్ప నాయునిచెరువుకు నీరు మళ్లించేందుకు పనులు చేపట్టారు. ఈ చెరువులు నిండితే తాగునీటి సమస్య పరిష్కరించవచ్చునన్నారు. చుట్టు పక్కల ఉన్న బోర్లల్లో కూడా నీటి మట్టం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఈవో ప్రసాద్ రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి కుమార్, నాయకులు షాకీర్, మునీర్, హబీద్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజెన్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడికి సన్మానం



మునిగోపాలకృష్ణను సన్మానిస్తున్న దృశ్యం

మదనపల్లె సిటీ: ఏపీ సీనియర్ సిటిజెన్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన ఎస్.మునిగోపాలకృష్ణను ఆదివారం స్థానిక బెంగళూరు రోడ్డులోని జీఆర్‌టీ ఉన్నత పాఠశాలలో అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ మునిగోపాలకృష్ణ చేసిన సేవలను గుర్తిస్తూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నిక కావడంతో అభినందనీయమన్నారు. అసోసియేషన్ సమస్యలను పరిష్కరించడానికి ప్రత్యేక చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మునిరత్నం, శ్రీనివాసులు, క్రిష్ణమూర్తి, తిరుపతిరావు, చంద్రశేఖర్, నారాయణమూర్తి, ఉస్మాన్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ములకలచెరువు: మండల దళిత హక్కుల పోరాటసమితి నూతన కార్యవర్గాన్ని ఆదివారం స్థానిక మండల కేంద్రంలో ఎన్నుకున్నట్లు ఆ సమితి అధ్యక్షుడు, కార్యదర్శి ఎం.హరి, సుదీర్‌కుమార్ తెలిపారు. మండల కన్వీనర్‌గా సోముశేఖర్, కార్యదర్శిగా గంగాధర్‌ను ఎన్నుకున్నట్లు చెప్పారు. దళిత హక్కుల పోరాటానికి కృషిచేస్తామని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

వేంపల్లి అబ్దుల్ ఖాదర్‌కు గౌరవ డాక్టరేట్



కలికిరి: పట్టణానికి చెందిన ప్రముఖ రచయిత, ఎస్వీయూ పాలకమండలి మాజీ సభ్యుడు వేంపల్లి అబ్దుల్ ఖాదర్‌కు గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆదివారం పాండిచ్చేరిలో జరిగిన సమావేశంలో ఆ యూనివర్సిటి సెనేట్ బోర్డు సభ్యుడు డా. మాన్యుయిల్, వీసీ డా. కె.వెంకటేషన్‌లు అబ్దుల్ ఖాదర్‌కు డాక్టరేట్ అందజేసి సత్కరించారు. కళాసాహిత్య, సాంస్కృతిక సేవా రంగాలలో వేంపల్లి చేసిన సేవలకు గుర్తింపుగానూ, సోషియల్ లీడర్స్ అండ్ రెస్పాన్స్‌బిలిటీస్ అనే అంశంపై నిర్వహించిన నేషనల్ సెమినార్‌లో ప్రతిభ చాటినందుగాను గౌరవ డాక్టరేట్ లభించినట్లు ఆయన తెలిపారు.

స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలి

మదనపల్లె సిటీ: విద్యార్థులు స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలని ఏబీవీపీ సీనియర్ నాయకుడు శ్యాంప్రసాద్ అన్నారు. ఆదివారం ప్రశాంత్‌నగర్‌లోని జ్ఞానోదయ పాఠశాలలో ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సం సందర్భంగా సెమినార్ నిర్వహించారు. స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యులు సాయిహితేష్, బాక్ కన్వీనర్ గౌతమ్, రెడ్డిప్రసాద్, కుసుమ, దినేష్ పాల్గొన్నారు .

పెళ్లి వేడుకలో సూడాన్ దేశస్తుల సందడి



ములకలచెరువు: పెద్ద తిప్పసముద్రంకు చెందిన షేక్ అబ్దుల్ వివాహం ఆదివారం ములకలచెరువులోని ఒక ప్రైవేటు కల్యాణ మండపంలో జరిగింది. ఈ వివాహానికి సూడాన్ దేశానికి చెందిన ఐదుగురు స్నేహితులు వచ్చారు. అబ్దుల్‌తో కలిసి వారంతా ఐదేళ్ల క్రితం కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో కలసి చదువుకున్నారు. అనంతరం ఉద్యోగరీత్యా అబ్దుల్ యూరప్ వెళ్లిపోయాడు.. తన వివాహానికి రావాలని సుడాన్ స్నేహితులను ఆహ్వానించాడు . సుడాన్‌కు చెందిన ఇమామ్, కరీమ్, మహమ్మద్, హస్సన్, అహ్మద్ తదితరులు వివాహ వేడుకలో సందడి చేశారు.

కరువు నేలలో కాసుల పంట

- ఖర్జూరం సాగు సక్సెస్
- ఆదర్శంగా నిలిచిన రైతు కె.లక్ష్మీకర్‌రెడ్డి

ములకలచెరువు: కరువుకు మారుపేరుగా నిలిచిన ములకలచెరువు మండలంలో అరబ్ దేశాల్లో పండే ఖర్జూరం పంట విజయవంతమైంది. ఎడారి ప్రాంతాల్లో మాత్రమే పండే ఖర్జూరం పంటను కరువు ప్రాంతం అనుకూలంగా మారిందని ఒక రైతు రుజువు చేశారు. ఇక్కడి ప్రాంతంలో వేరుశనగ, టమాట పంటల వైపు రైతులు ఎక్కువగా మొగ్గు చూపుతారు. మరి కొంత మంది రైతులు ఉద్యానవన పంటలైన దానిమ్మ, బొప్పాయి, నేరుడు పంటలను సాగుచేస్తున్నారు. తరచూ సాగు చేసే పంటల వైపు వెళ్లకుండా ఒక రైతు వినూత్నంగా అరబ్ దేశాల్లో సాగయ్యే పంట వైపు మొగ్గుచూపాడు. ఖర్జూరం పంట సాగుచేసి విజయవంత మయ్యాడు. పంట కోత దిగుబడికి వస్తుండడంతో దిగుబడి అనుకున్నదాని కంటే ఎక్కువగా వస్తోంది. దీంతో అద్భుతమైన ఫలితాలు రాబట్టాడు. ములకలచెరువు మండలం సోంపల్లెకు చెందిన రైతు. కె.లక్ష్మీకర్‌రెడ్డి 2018 ఏడాదిలో ఆరు ఎకరాల్లో ఖర్జూరపు చెట్లు సాగుచేశాడు. ఎకరాకు రూ.4 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు ఖర్చుచేశాడు. రాజస్థాన్ రాష్ట్రం జోద్‌పూర్ నుంచి టిష్యూ కల్చర్ ఖర్జూరపు మొక్కలను తీసుకొచ్చి నాటించాడు.ఆరు ఎకరాల్లో 440 మొక్కలు నాటాడు. ఖర్జూరపు పంటకు ఇక్కడ ఉష్ణోగ్రతలు అనుకూలంగా మారాయి. ఫలితంగా పంట ఆశించిన మేర



రైతు సాగుచేసిన ఖర్జూరం తోట

విజయవంతమైంది. ప్రస్తుతం ఖర్జూరం కాయలు దిగుబడి దశకు వస్తున్నాయి. ఒక్కో చెట్టుకు 20 నుంచి 30 వరకు గెలలు వస్తాయి. ఒక్కో చెట్టుకు 120 కేజీల కాయలు దిగుబడివచ్చే అవకాశం ఉంది. మార్కెట్‌లో వీటికి ధర ఎక్కువ, డిమాండ్ అధికం.

80 ఏళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం

ఖర్జూరపు పంట ఒక్కసారి సాగు చేస్తే సుమారు 80 ఏళ్ల వరకు దిగుబడి వస్తాయి. అరబ్ దేశాల్లో పండే ఖర్జూరపు కాయలు ఇక్కడ నేలలో పండుతాయని నిరూపించాడు రైతు. అధిక ఉష్ణోగ్రతలు ఉండే గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల్లో ఖర్జూరం పంట సాగుతోంది. ప్రస్తుతం కరువు ప్రాంతమైన ములకలచెరువులో కూడా ఎడారి పంట సాగవ్వడం చూస్తుంటే ఇక్కడి ఉష్ణోగ్రతలు అనువుగా ఉన్నట్లు తెలుస్తోంది.



విరగ్గాసిన ఖర్జూరపు కాయలు

నెలకు ఒక్కసారి నీరు పెడితే చాలు

ఎడారిలో పండే ఖర్జూరం పంటకు నెలకు ఒక్కసారి నీరు అందిస్తే చాలు. అతి తక్కువ నీటితో సాగు చేయొచ్చు. మిగతా పంటల మాదిరిగా ప్రతి రోజూ నీరు అందించాల్సిన అవసరం లేదు. ప్రతి చెట్టుకు కాయలు కాస్తున్నాయి. దిగుబడి ఆశించిన మేర వస్తోంది. నీటి వినియోగం చాలా తక్కువ. చెట్టుకు రోగాలు, వైరస్ లాంటివి పట్టవు.

– కె. లక్ష్మీకర్‌రెడ్డి, రైతు, ములకలచెరువు



గర్నిమిట్ట యల్లమ్మకు పూజలు



ప్రత్యేకాలంకరణలో యల్లమ్మతల్లి

కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్ట గ్రామ దేవత యల్లమ్మతల్లికి విశేష పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేకాలంకరణ, పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. పరిసర గ్రామాలకు చెందిన మంగళవాయిద్యాలతో బోనాలు ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయ ప్రదక్షణ చేపట్టారు. అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు.

ఎంఈఓ- 2గా సుబ్రహ్మణ్యం

వాల్మీకిపురం: గుర్రంకొండ మండల ఎంఈఓ-2గా సుబ్రహ్మణ్యం బాధ్యతలు చేపట్టారు. కలికిరి మండలం మేడికుర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పని చేస్తున్న సుబ్రహ్మణ్యం పదోన్నతిపై ఎంఈవో- 2గా బాధ్యతలు చేపట్టారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని కలుసుకొని, పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని పాఠశాలల అభివృద్ధితో పాటు, ఉత్తమ ఫలితాలు రాబట్టడానికి

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఇంటింటికీ మొక్కలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం పచ్చదనం తగ్గిపోవడంతో వాతావరణంలో మార్పులు వచ్చి విపరీతమైన వేడి వస్తోందని తెలిపారు. విరివిగా మొక్కలు పెంచడం ద్వారా దీనికి పరిష్కారం లభిస్తుందన్నారు. పీలేరును పచ్చదనంతో నింపడమే లక్ష్యంతి ఇంటింటికీ మొక్కలు ఇవ్వడానికి 15 వేల మొక్కలు గ్రామ వలంటీర్లకు అందజేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ తీసుకున్న మొక్కను నాటి సంరక్షించాలని కోరారు. ప్రతి ఏటా ఇంటికో మొక్క చొప్పున పంపిణీ చేస్తామని తెలిపారు. మొక్కలు పెంచేవారికంటే వాటిని నరికే వారు ఎక్కువయ్యారని, మానవ మనుగడకు మొక్కలే ఆధారమన్న విషయం ప్రతి ఒక్కరూ గ్రహించాలన్నారు. కాలుష్య నివారణ, పర్యావరణ పరిరక్షణకు విరివిగా మొక్కలు పెంచాలని పిలుపునిచ్చారు.



మొక్కలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

మొక్కలు స్వచ్ఛమైన గాలి ఇవ్వడం తోపాటు సంవృద్ధిగా వర్షాలు కురుస్తాయని తెలిపారు. గ్రామ వలంటీర్లు ఇంటింటికీ మొక్కలు ఇవ్వడం తోపాటు మొక్కల పెంపకం ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రత్నశేఖర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ యల్లయ్య, సర్పంచ్‌లు డాక్టర్ హబీబ్‌బాషా, దండు జగన్‌మోహన్‌రెడ్డి, చంద్రారెడ్డి, నాయకులు హుమయూన్, మహితా ఆనంద్, మస్తాన్, రెడ్డిబాషా, ఉదయ్‌కుమార్, చలపతి, అబీద్, శ్రీనాథరెడ్డి, మునీర్, జయపాల్‌రెడ్డి, హరిత, పెద్దోడు, నాగరాజమ్మ, ఫారెస్ట్ అధికారి రామ్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఎలమ్మ జాతర మహోత్సవం

- తేరుపై ఎల్లమ్మ చిద్విలాసం
- భక్తులతో కిటకిటలాడిన ఆలయం
- భక్తిశ్రద్ధలతో దీలు, బోనాలు సమర్పణ

కలికిరి: కలికిరి గ్రామ దేవత ఎల్లమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు ఆదివారం ఉదయం అమ్మవారు నూతన తేరుపై విహరించారు. ఆలయం వద్ద నుంచి విశేష పుష్పాలంకరణ చేసిన నూతన తేరుపై అమ్మవారు చేసి ఆర్.ఎస్. రోడ్డు, బ్రాహ్మణవీధి, మెయిన్ బజారు, రైల్వే బ్రిడ్జి వరకు చిద్విలాసంగా ఊరేగారు. అమ్మవారిని చూసిన భక్తులు పులకరించారు. ఈ సందర్భంగా భక్తులు ఇంటింటి వద్ద అమ్మవారికి పూజలు నిర్వహించి కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతులు సమర్పించి పూజలు నిర్వహించారు. మొక్కులు తీర్చుకున్నారు. తేరుపై అమ్మవారి అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. పురవీధులలో తేరును లాగడానికి భక్తులు పోటీపడ్డారు. తిరిగి ఆలయానికి చేరుకున్న తరువాత సిద్ధపూజ నిర్వహించారు. అమ్మవారికి వరపడిన భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

దీలు, బోనాలు సమర్పణ

మధ్యాహ్నం నుంచి కలికిరి పట్టణంతో పాటు చుట్టు పక్కల గ్రామాలు, ఇతర ప్రాంతాల నుంచి విచ్చేసి భక్తులు అమ్మవారికి దీలు, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సంప్రదాయ



తేరుపై పురవీధులలో ఊరేగుతున్న ఎల్లమ్మ

వాయిద్యాలు, చెక్కభజనలు, బళ్ళారి డ్రమ్స్ తదితర వాయిద్యాల నడుమ వైభవంగా ఊరేగింపుగా అమ్మవారికి బోనాలు సమర్పించారు. భక్తుల ఊరేగింపులతో కలికిరి పట్టణంలో భక్తివాతావరణం, భక్తుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తుల తాకిడితో ఆలయ పరిసరాలను కిక్కిరిశాయి. రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు వివిధ ప్రాంతాల నుంచి చాందినీ బండ్లు ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకోనున్నాయి. ఆలయ ప్రదక్షిణలు, అమ్మవారికి బలిదానం సమర్పణతో వర పడిన భక్తుల మొక్కులు తీరుతాయి.

పటిష్ట బందోబస్తు

నలుగురు సీఐలు, ఏడుగురు ఎస్ఐలు, ఏఎస్ఐలు,



అమ్మవారికి దీలు, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

హెడ్‌కానిస్టేబుల్‌లు, పీసీలు, హోంగార్డులు మొత్తం 150 మంది సిబ్బంది జాతర బందోబస్తులో పాల్గొన్నారు. కలికిరి గాంధీ కూడలి నుంచి భారీ వాహనాలను పట్టణంలోకి అనుమతించకుండా నిలువరించారు. రైల్వే బ్రిడ్జి ప్రాంతం నుంచి వాహనాల మళ్లింపుతో జాతరలో భక్తులకు ట్రాఫిక్ సమస్య తప్పింది.

జాతరలో నేడు..

జాతర ఉత్సవాలలో మూడవ రోజు సోమవారం ఉదయం అమ్మవారి సర్వదర్శనం, రాత్రికి లంకాదహనం కార్యక్రమం అనంతరం అమ్మవారు పుష్పపల్లకీ వాహనంలో పురవీధులలో ఊరేగుతారని ఆలయ ధర్మకర్త రెడ్డివారి అశోక్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 62 మంది ఎంపిక

మదనపల్లె : పట్టణంలోని శ్రీ శ్రీనివాస డిగ్రీ కళాశాలలో టెక్ మహీంద్రా, టాటా అనుబంధ సంస్థ కనెక్ట్ బిజినెస్ సొల్యూషన్స్ లిమిటెడ్ కంపెనీలు నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 62 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ ఎస్.కృష్ణారెడ్డి, కరస్పాండెంట్ ఎస్.శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఆదివారం కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో 28 మంది టెక్ మహీంద్రా సంస్థకు, 34 మంది కనెక్ట్ బిజినెస్ సొల్యూషన్స్‌కు 34 మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. టెక్‌మహీంద్రా సంస్థలో రూ.2.8లక్షల వరకు వార్షికవేతనం, కనెక్ట్ బిజినెస్ సొల్యూషన్స్‌లో రూ.2లక్షల వరకు వార్షిక వేతనం లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్, కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ బి.వి.రమణాచారి, అధ్యాపకులు అభినందించారు.



క్యాంపస్ ఇంటర్వ్యూలకు ఎంపికైన విద్యార్థులు

యోగాతో దీర్ఘకాలిక వ్యాధులు నయం

పీలేరు రూరల్: ఆధునిక అలోపతి వైద్యానికి శాస్త్రీయ యోగా కలబోత అనే ధోరణితో గుప్తా ఆసుపత్రిలో యోగా కన్సల్టేషన్ ప్రారంభించినట్లు యోగా థెరపి డాక్టర్ పివిఎస్ లక్ష్మి అన్నారు. ఆదివారం స్థానిక గుప్తా ఆసుపత్రిలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దీర్ఘకాలిక జబ్బులను తగ్గించడానికి యోగా సెంటర్లను ప్రారంభించడం జరిగిందన్నారు. అధిక బరువు, రక్తపోటు, మధుమేహము, హార్మోనల్ ఇన్‌బ్యాలెన్స్ రుతు గర్భం సంబంధిత సమస్యలు, థైరాయిడ్ వంటి జబ్బులకు యోగాలో చక్కటి ఆసనాలు, ప్రాణాయామాలు ఉన్నాయన్నారు. గుప్తా ఆసుపత్రిలో ప్రతి సోమ, మంగళవారాల్లో ఉదయం 11 నుంచి 12 గంటల వరకు యోగాథెరఫి అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు మమతా లక్ష్మి, శ్రీనివాసులు, సలహాదారులు రాయల్ సుధాకర్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆసుపత్రి సిబ్బంది

మదనపల్లె ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ ఎన్నిక

మదనపల్లె : మదనపల్లె అనిబిసెంట్ ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక ఆదివారం నిర్వహించారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ బండపల్లి అక్కులప్ప పర్యవేక్షణలో ప్రెస్‌క్లబ్ కన్వీనర్ వంశీధర్ రిటర్నింగ్ అధికారిగా ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులు ఏకగ్రీవం కాగా, కార్యదర్శి, కోశాధికారి పదవులకు ఎన్నిక జరిగింది. ప్రెస్‌క్లబ్‌లో సభ్యత్వం కలిగిన 68 మంది విలేకరుల్లో 61 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా జి.రమేష్‌బాబు (టీవీ-5), ఉపాధ్యక్షుడిగా మజ్జిగ బాలకృష్ణయాదవ్ (విశాలాంధ్ర), కుర్రా శ్రీధర్‌బాబు (స్వతంత్ర టీవీ), సంయుక్త కార్యదర్శిగా వడిగలశేఖర్‌బాబు (నమోటీవీ) ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. కార్యదర్శి, కోశాధికారి పదవులకు జరిగిన ఎన్నికల్లో ఎస్.చంద్ర (ప్రజాశక్తి) కార్యదర్శిగా, ఆకుల కిరణ్‌కుమార్(ఎంసీ టీవీ) గెలుపొందారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు రమేష్‌బాబు మాట్లాడుతూ.. ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి, పాత్రికేయుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు.



ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ సభ్యులు

యల్లమ్మ తల్లీ.. కరుణించమ్మా

వాల్మీకిపురం: స్థానిక తిరుపతి రోడ్డులో వెలసిన యల్లమ్మ ఆలయంలో ఆదివారం జాతర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అర్చన, అభిషేకం, పంచామృతాభిషేకం, విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. మహిళలు దీలు బోనాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు.



మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

గిరిజన సమస్యలపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు

వాల్మీకిపురం: గిరిజన యానాది భూముల సాగుకు అగ్రవర్ణాలు ఆటంకం కలిగిస్తున్నారని గిరిజన యానాదులు ఆదివారం ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి కలిసి ఫిర్యాదు చేశారు. కేవీపల్లి మండలం మార్లెళ్ల పంచాయతీ మంచాలమంద సమీపంలో 1983 సంవత్సరంలో అప్పటి తహసీల్దార్ వెంకటసుబ్బారెడ్డి గిరిజన యానాదులు సిద్దయ్య, వెంకటయ్య, పాపయ్య కుటుంబాల జీవనోపాధికి సాగు కోసం 10.5 ఎకరాలు ప్రభుత్వ భూమిని పంపిణీ చేశారని తెలిపారు. అయితే కొంత మంది అగ్రకులస్తులు గిరిజనులకు అడ్డు తగులుతూ, గొడవలకు వస్తున్నారన్నారు. దీంతో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయడంతో వీఆర్వో, వీఆర్ఏ, సర్వేయర్‌తో కలసి సరిహద్దులు నాటారన్నారు. అయినా కూడా బెదిరింపులకు గురి చేస్తున్నారని ఎమ్మెల్యే కు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజనులకు న్యాయం చేయాలని తహసీల్దార్ నరసింహులను ఫోన్ ద్వారా ఆదేశించారు. కార్యక్రమంలో పులి శ్రీనివాసులు, గడ్డం శ్రీనివాసులు, జానం గంగిరెడ్డి, నారాయణమ్మ, వెంకటరమణ నాయుడు, శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి చేయూత



అదనపు తరగతి గదుల వద్ద పూర్వపు విద్యార్థులు

మదనపల్లె సిటీ: జవహర్ నవోదయ విద్యాలయ పూర్వపు విద్యార్థులు విరాళాలతో రెండు అదనపు తరగతి గదులు నిర్మించారు. ఆదివారం స్థానిక చిత్తూరు రోడ్డులోని జవహర్ నవోదయ విద్యాలయంలో 1990-1997, 2001-2008 పూర్వపు విద్యార్థుల సమావేశం జరిగింది. పూర్వపు విద్యార్థులందరూ కలిసి విద్యాలయ అభివృద్ది చేయడానికి ముందుకు వచ్చారు. ఇందులో భాగంగా రూ.18 లక్షలతో విద్యాలయంలో రెండు అదనపు తరగతి గదులు నిర్మించారు. తరగతి గదులను విద్యాలయ ప్రిన్సిపాల్ గోవిందరావు, వైస్ ప్రిన్సిపాల్ పద్మావతి, రిటైర్డు ప్రిన్సిపాల్ కాశయ్యలతో కలిసి ప్రారంభించారు. పూర్వపు విద్యార్థులందరూ కలిసి విద్యాలయంలో చదివిన రోజులను గుర్తు తెచ్చుకున్నారు. ఒకరినొకరు కలిసి అప్యాయంగా మాట్లాడుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. ప్రిన్సిపాల్ గోవిందరావు మాట్లాడుతూ విద్యాలయానికి పూర్వపు విద్యార్థులు చేస్తున్న సహాయ, సహకారాలను కొనియాడారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

మదనపల్లె : మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీలోని మాజీ ఎమ్మెల్యే తిప్పారెడ్డి ఇంటి వద్ద ఆదివారం ఉదయం నుంచే సందడి మొదలైంది. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు డాక్టర్ దేశాయ్‌తిప్పారెడ్డిని కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. కూరపర్తి అనాథ ఆశ్రమంలో, మార్కెట్‌యార్డులో అన్నదానం నిర్వహించారు. నిమ్మనపల్లె పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. దేశాయ్‌జయదేవ్ రెడ్డి, కోళ్లబైలు సర్పంచ్ ఆనందరెడ్డి, బీఎస్ఎన్ఎల్ తిరుపతి ప్రాంతీయ జిల్లా అడ్వైజరీ బోర్డు మెంబర్ డి.హర్షవర్ధన్‌రెడ్డి, కే.మధురెడ్డి, కౌన్సిలర్ గిరిజ, సాయిశేఖర్‌రెడ్డి, గాంధీ, భువనేశ్వరిసత్య, కాలవ ఆనందరెడ్డి, మస్తాన్‌రెడ్డి, ఎం.మాధవరెడ్డి, జి.బయ్యారెడ్డి, వలసపల్లె నాగరాజరెడ్డి, తట్టినాగరాజరెడ్డి, సురేంద్ర, రేవనముని, వసంత్‌రెడ్డి, కమాల్‌ఖాన్, బుల్లెట్‌షఫీ, జన్నేరాజేంద్రనాయుడు, రోలింగ్‌మల్లిక, నూర్, కోటూరిఈశ్వర, నల్లచెరువుబాషా, శ్రీనాథ్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.



డాక్టర్ దేశాయ్‌తిప్పారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న సర్పంచ్ ఆనందరెడ్డి తదితరులు

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఏర్పాటు

పీలేరు రూరల్ : పీలేరు లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో 2023-24 సంవత్సరానికి గానూ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా జి. సురేంద్రనాథరెడ్డి, కార్యదర్శిగా పి. సుబ్రమణ్యం, కోశాధికారిగా జయచంద్రనాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు మహేష్‌గుప్తా, సదాశివరెడ్డి, డాక్టర్ ప్రసాద్, శౌరిదర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, బాలాజి, మోహన్‌రెడ్డి, రవి, కిషోర్, నరసింహులుశెట్టి, సుధాకర్‌రెడ్డి, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సురేంద్రనాథరెడ్డి, సుబ్రమణ్యం, జయచంద్రనాయుడు

సందడిగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనానికి హాజరైన పూర్వవిద్యార్థులు

ములకలచెరువు: మండలంలోని బురకాయలకోట జెడ్పీహైస్కూల్‌లో ఆదివారం జరిగిన పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో ఒకరినొకరు ఎంతో ఆప్యాయంగా పలకరించుకున్నారు. 1987–88 సంవత్సరానికి చెందిన పదో తరగతి విద్యార్థులంతా ఒక చోట సమావేశమయ్యారు. యోగక్షేమాలు తెలుసుకుంటూ సంతోషం పంచుకున్నారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ 35 సంవత్సరాల తర్వాత అందరు ఒకే చోట కలవడం సంతోషంగా ఉందన్నారు. చదువులో పోటీ పడుతూనే స్నేహపూర్వకంగా కలిసి మెలిసి ఉండేవాళ్లమని గుర్తు చేసుకున్నారు. మళ్లీ పాఠశాలలోనే ఇలా కలవడంతో విద్యార్థుల్లా వచ్చిన అనుభూతి కలుగుతోందని చెప్పారు. చదువుకొని వివిధ వ్యాపారాలు, ఉద్యోగాలలో స్థిర పడినట్లు చెప్పుకున్నారు. అప్పట్లో చదువు చెప్పిన గురువులు కనకసభాపతి, సులోచనకుమారి, చంద్రశేఖర్, రామకృష్ణమరాజు తదితరులను సన్మానించారు.



నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

అపూర్వ కలయిక

బి.కొత్తకోట: మదనపల్లె వివేకనంద మున్సిపల్ హైస్కూల్‌లో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై కలుసుకుని సందడి చేశారు. 1996–97లో వివేకానంద హైస్కూల్‌లో పదవ తరగతి చదివిన విద్యార్థులు ఎక్కడెక్కడో స్థిర పడిపోయారు. వీరంతా హార్సిలీహిల్స్‌పై కలుసుకుని సమావేశమయ్యారు. అప్పటి ఉపాధ్యాయులు సిద్దారెడ్డి,రమాదేవి, రెడ్డెప్ప, వెంకటరమణ, సుధాకర్‌లను సమావేశానికి ఆహ్వానించి ఘనంగా సత్కరించారు.